క్లుప్తంగా

ఆలయ ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

చండూరు(గట్టుప్పల) : ఈ నెల 26, 27, 28 తేదీల్లో గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించనున్న ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంత్రి జగదీశ్‌రెడ్డికి బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్నాటి అశోక్, మొదు బాలయ్య, మొద్దు గాలయ్య, ఖమ్మం రాములు, ఖమ్మం రామస్వామి, దుబ్బాక మల్లేశం, నరేష్, విష్ణు తదితరులు ఉన్నారు.

24నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కనగల్ : మండల పరిధిలోని బోయినపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద ఈ నెల 24నుంచి 27వరకు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చండూరు : కస్తాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం చండూరు ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1800 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని తెలిపారు. 9 గ్రామ పంచాయతీల్లో ఫిష్ పాండ్ పనులు, మరో నాలుగు గ్రామాల్లో ఫీడర్ ఛానల్ పనులు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాస్ ఉన్నారు.

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఉపాధి హామీ పనులను ఎంపీఓ ఝాన్సీ మంగళవారం పరిశీలించారు. కూలీలు వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులకు సమయానుకూలంగా వెళ్లి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు యాదయ్య పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల పూజలు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం(పర్వతగిరి) స్టేజి వద్ద గల శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని చీర, సారెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివుడి విగ్రహం వద్ద ప్రమిదలు వెలిగించారు. కోరికలు నెరవేరాలని ముడుపులు కట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

డౌన్ సిండ్రోమ్ డే వేడుకలు

చిట్యాల : పట్టణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, ఆవుల గీత, హెచ్‌ఎం స్లీవమ్మ, ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, సరిత, వరలక్ష్మీ, జాన్ కిశోర్, ప్రవళ్లిక, జయకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలకు గ్యాస్ పొయ్యి బహూకరణ

చండూరు : మండల పరిధిలోని పుల్లెంల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ సమకూర్చిన గ్యాస్ పొయ్యిని ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి మంగళవారం హెచ్‌ఎం హేమలతకు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీకాంత్, నాగరాజు, కారింగు సాయి, హరీశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి మృతికి కొవ్వొత్తులతో నివాళి

శాలిగౌరారం : మండలంలోని శాలి లింగోటంకు చెందిన విద్యార్థి కొప్పుల యశ్వంత్(10) మృతికి సంతాపసూచకంగా మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అఖిలపక్షం నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ నాయకులు అన్నెబోయిన సుధాకర్, చలకాని మల్లయ్య, జమ్ము రమేశ్, లింగయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టాలపై అవగాహన

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 9,10వ తరగతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బి.దీప్తి పాల్గొని ర్యాగింగ్ నిషేధ చట్టాలు, పౌరుల విధులు, హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వి.ముదిరాజు, ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ దీప్తి

క్రీడా ప్రాంగణాల్లో వసతులు కరువు

- సామగ్రి సమకూర్చని అధికారులు
- శాలిగౌరారం మండలంలో 3 గ్రామాల్లో పూర్తి కాని స్థల సేకరణ
- వసతులు కల్పించాలంటున్న క్రీడాకారులు

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఒక ఎకరం విస్తీర్ణంలో గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకోసం గ్రామ పంచాయతీల్లో భూసేకరణ బాధ్యతను తహసీల్దార్ కార్యాలయాలకు (రెవెన్యూశాఖ) అప్పగించింది. కార్యక్రమంలో భాగంగా శాలిగౌరారం మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను 21 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను గుర్తించారు. మరో మూడు గ్రామపంచాయతీలు వంగమర్తి, బండమీదిగూడెం, జాలోనిగూడెం గ్రామపంచాయతీల పరిధిలో స్థల సేకరణ పూర్తి కాలేదు.

ఎకరం స్థలం ఉన్న క్రీడా ప్రాంగణాలు నాలుగు మాత్రమే

ప్రభుత్వ నిబంధన ప్రకారం ఎకరం విస్తీర్ణం ఉన్న గ్రామీణ క్రీడా ప్రాంగణాలు కేవలం నాలుగు గ్రామ పంచాయతీల్లో మాత్రమే ఉన్నాయి. వాటిలో ఇటుకులపహాడ్, చిత్తలూరు, భైరవునిబండ, తుడిమిడి గ్రామపంచాయతీలు ఉన్నాయి. మిగిలిన 17 గ్రామ పంచాయతీల్లో స్థల సమస్య ఏర్పడడంతో పాఠశాలలకు చెందిన క్రీడా స్థలాలనే గ్రామీణ క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. భైరవునిబండలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిలో ఎకరం భూమిని గ్రామీణ క్రీడా ప్రాంగణానికి కేటాయించగా, గ్రామానికి చెందిన కొంతమంది ఆ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు.



శాలిగౌరారం మండలం భైరవునిబండలో గ్రామీణ క్రీడా ప్రాంగణం

స్థలాల ఎంపికతోనే సరిపెట్టారు

ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులు, ఆటలు ఆడుకోవడం, వ్యాయామం చేసుకునేందుకు క్రీడా సామగ్రిని సమకూర్చడానికి నిర్ణయించింది. ఆ ప్రకారం ఆయా క్రీడా ప్రాంగణాల్లో ముఖద్వారంతో పాటు వాలీబాల్ పోల్స్ సంబంధిత సామగ్రి, సింగిల్ ఎక్సైజ్‌బార్, డబుల్ ఎక్సైజ్ బార్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు శాలిగౌరారం మండలంలో క్రీడా ప్రాంగణాలకు స్థల ఎంపిక మాత్రమే పూర్తయింది. అందులోనూ 24 గ్రామ పంచాయతీలకు 21 గ్రామ పంచాయతీలకే స్థల ఎంపిక జరిగింది. క్రీడా ప్రాంగణాలను ప్రారంభించి 10 నెలలు గడచినా నేటికీ ఒక్క క్రీడా ప్రాంగణంలో కూడా క్రీడా సామగ్రి ఏర్పాటు కానీ, ఇతర అభివృద్ధి పనులుగానీ జరుగలేదు. మండలంలో ఏ గ్రామీణ క్రీడా ప్రాంగణంలోనూ క్రీడా సామగ్రి ఏర్పాటు చేయకపోవడం, అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో క్రీడా సామగ్రిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు సంబంధించిన క్రీడా సామగ్రి మండల కేంద్రంలో సిద్ధంగా ఉంది. క్రీడా సామగ్రిని ఏర్పాటు చేసేందుకు నిర్మాణదారుల కోసం వేచిచూస్తున్నాం. వీలైనంత త్వరలో క్రీడా ప్రాంగణాల్లో అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం.

– రేకల లక్ష్మయ్య, ఎంపీడీఓ, శాలిగౌరారం

కార్యకర్తలను కాపాడుకుంటాం

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ప్రమాదవశాత్తు మరణించిన కనగల్, నల్లగొండ మండలాలకు చెందిన కార్యకర్తల కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున మంజూరైన బీమా చెక్కులను మంగళవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తనను నేరుగా కలవొచ్చన్నారు. కనగల్ మండలంలోని శేరిలింగోటం గ్రామానికి చెందిన మేరెడ్డి ఇందిరమ్మ, కనగల్‌కు చెందిన గోనెల లక్ష్మమ్మ, బోయినపల్లి గ్రామానికి చెందిన బిక్షాల నగేష్, నల్లగొండ మండలం ఎం.దుప్పలపల్లికి చెందిన చింతల అరుణ, జి.కె.అన్నారం గ్రామానికి చెందిన కొత్త అండాలుకు రూ.2 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కనగల్ ఎంపీపీ కరీంపాషా, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, నాయకులు బకరం వెంకన్న, గాదె రాంరెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ కృషి

రామగిరి(నల్లగొండ) : క్రైస్తవుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బిలీవర్స్ చర్చ్‌లో నల్లగొండ జిల్లా పాస్టర్స్ అసోసియేషన్, సిటిజ్ ఆఫ్ తెలంగాణ, లైట్ ఆఫ్ తెలంగాణల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పాస్టర్ల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు వారు హాజరై మాట్లాడుతూ చర్చీల నిర్మాణాలకు అనుమతితోపాటు క్రిస్మస్ పండుగను ప్రభుత్వమే ఘనంగా నిర్వహిస్తోందన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం ప్రేయర్ డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. జెడ్పీ కో.ఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్ ఐజాక్ రామ్, బిషప్ సుధీర్‌కుమార్, కన్నడ డేవిడ్, విజయ్, రాజ్‌కుమార్, కట్ట మోజోష్, దుబ్బ డేవిడ్ రాజ్, విల్సన్, హానోక్, క్రిస్టఫర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



వడగండ్లకు దెబ్బతిన్న వరి చేలను పరిశీలిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని సుంకెనపల్లి గ్రామంలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుంకెనపల్లి, గుండ్రాంపల్లి గ్రామాల సర్పంచ్‌లు కక్కిరేణి బొందయ్య, రత్నం పుష్ప నర్సింహ, ఉప సర్పంచ్ బాతరాజు రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు పంతంగి మదనాచారి, మండల కార్యనిర్వాహక కార్యదర్శి యాకారి నరేందర్, బల్గూరి సైదులు, ఆవుల యాదయ్య పాల్గొన్నారు.

162 ఎకరాల్లో పండ్లు, కూరగాయల తోటలకు నష్టం

చిట్యాల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కురిసిన వడగండ్ల వర్షానికి 162 ఎకరాల్లో పండ్ల తోటలు, కూరగాయల తోటలకు నష్టం వాటిల్లిందని నకిరేకల్ నియోజకవర్గ ఉద్యానవన శాఖ అధికారి రావుల విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. మండలంలోని గుండ్రాంపల్లి, నేరడ, వెలిమినేడు, సుంకెనపల్లి, చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాల్లో 80 ఎకరాల్లో నిమ్మ, 32 ఎకరాల్లో మామిడి, 50 ఎకరాల్లో కూరగాయల తోటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టం వివరాలను జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పండ్ల తోటల నష్ట పరిహారం కోసం బాధిత రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్, బ్యాంకు అకౌంట్ నంబర్‌తోపాటు పంట నష్టపోయిన ఫొటోల వివరాలతో నకిరేకల్ ఉద్యానవన శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



నేల రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి రావుల విద్యాసాగర్

అండర్‌పాస్ ఇబ్బందులు తొలగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చిట్యాల : వెలిమినేడు గ్రామం వద్ద హైవే అండర్ పాస్ బ్రిడ్జి కింద వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు దేశబోయిన స్వరూపనర్సింహ మాట్లాడుతూ వర్షం వచ్చినప్పుడల్లా అండర్ పాస్ బ్రిడ్జి కింద నీరు నిలిచి గ్రామంలోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేశబోయిన నర్సింహ, అర్రూరి పవన్, శివ, బాలకృష్ణ, కిరణ్, ఉపేందర్, కృష్ణయ్య, రోహిత్ పాల్గొన్నారు.

తెలుగు నూతన సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సిద్ధాంత కర్త

నార్కట్‌పల్లి : రామన్నపేట మండలం నీరునాముల గ్రామానికి చెందిన పంచాంగ సిద్ధాంత కర్త చేదోజు సత్యనారాయణశాస్త్రి రూపొందించిన తెలుగు నూతన సంవత్సర పంచాంగాన్ని మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్థానిక సర్పంచ్ దూదిమెట్ల స్రవంతివెంకటేశ్వర్లులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు గ్రామానికి చెందిన గడ్డం సత్తయ్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ చైర్మన్ చొల్లేటి బ్రహ్మాచారి, చొక్కళ్ళ పుష్పగిరి, వైస్ చైర్మన్ గుంటోజు రమేష్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి శ్రీనివాసచారి, బోయపల్లి శ్రీను, ఓంప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకుడు ఉత్తరపల్లి అనంతాచార్యులు, అర్చకులు నరసింహాచార్యులు, భీష్మాచారి, గడగోజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

చిట్యాల : పట్టణంలోని మూడో వార్డుకు చెందిన రొక్కం కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి మంగళవారం పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా రెడ్డి యువజన సంక్షేమ సంఘం తరపున సేకరించిన రూ.10 వేలను ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు బొబ్బలి శివశంకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి యువజన సంక్షేమ సంఘం ప్రతినిధులు తోకల నరేందర్‌రెడ్డి, వరకాంతం భాస్కర్‌రెడ్డి, జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, సామ రామకృష్ణారెడ్డి, కల్లెం మోహన్‌రెడ్డి, ఎలిమినేటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జన చైతన్య యాత్ర పోస్టర్ విడుదల

చండూరు : ఈ నెల 17 నుంచి మొదలై 29వ తేదీ వరకు కొనసాగనున్న జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన వాల్ పోస్టర్‌ను చండూరు మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం మంగళవారం ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ్య, బొమ్మరగోని కిరణ్, గండూరి మారుతి, శివ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్ ..

నకిరేకల్ : ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92 వర్ధంతి వేడుకలను వాడవాడలా నిర్వహించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అంబటి చిరంజీవి కోరారు. నకిరేకల్‌లో యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో వేడుకల ప్రచార పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. దేశం కోసం 23 ఏళ్ల వయసులోనే ఉరికంబం ఎక్కిన విప్లవ యువ కిశోరాలు షహీద్ భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్ దేవ్‌లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బుడిగె శ్రీను, మామిడోజు వెంకన్న, గుగ్గిళ్ల నాగరాజు, పిట్టల అనిల్, యల్లముల సైదులు, పవన్, చెరుకు సైదులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రాల..

చిట్యాల : కేంద్రం అవలంబిస్తున్న రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాల ప్రమీల కోరారు. చిట్యాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో చలో ఢిల్లీ ప్రచార కరపత్రాలను ఆమె విడుదల చేసి మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాసులు, రత్నం యాదయ్య, వడ్డెపల్లి శంకర్, నాగిళ్ళ మహేష్, పబ్బు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పండుగ సందడి



నల్లగొండలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



తేరట్‌పల్లిలో ఉగాది పచ్చడి తింటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలో ఉగాది పండుగ సందడి నెలకొంది. తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది శ్రీ శోభకృత్ నామ సంవత్సర వేడుకలకు ఘనంగా నిర్వహించుకునేందుకు పట్టణ ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. మంగళవారం ప్రజలు పండుగకు కావాల్సిన మామిడి కాయలు, ఆకులు, పూలు, పచ్చడి కుండలను కొనుగోలు చేశారు. దీంతో పట్టణంలోని వీధులు కిక్కిరిసిపోయాయి.

ఉగాది వేడుకలకు ఆలయాల్లో ఏర్పాట్లు

నకిరేకల్ : ఉగాది పండుగ సందర్భంగా నకిరేకల్, కేతేపల్లి, చిట్యాల, శాలిగౌరారం, నార్కట్‌పల్లి, కట్టంగూర్ మండల కేంద్రాల్లోని ప్రధాన ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా మండల కేంద్రాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో కవి సమ్మేళనంతోపాటు ఉగాది పచ్చడి పంపిణీ చేయనున్నారు. నకిరేకల్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి, ఐశ్వర్య సాయి, రామలింగేశ్వర, సత్యసాయి, గీతా మందిరం, పద్మశాలి భవన్, ఆఫీసర్స్ క్లబ్‌లలో బుధవారం ఉగాది సందర్భంగా సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

పాఠశాలలో ఉగాది సంబరాలు

చండూరు : గట్టుప్పల మండల పరిధిలోని తేరట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముందస్తుగా ఉగాది పండుగ సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉగాది పచ్చడి తయారు చేసుకొని తిన్నారు. హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి ఉపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాంనాయక్, సాయిరాం, నర్సింహ, గోన వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నకిరేకల్ : అన్నివర్గాల ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని నకిరేకల్ ఎస్‌ఐ రంగారెడ్డి కోరారు. నకిరేకల్‌లోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి అన్ని ఆలయాల చైర్మన్లు, మసీదు, చర్చి కమిటీల నిర్వాహకులలతో నిర్వహించిన మైత్రి సమావేశంలో ఆయన మాట్లాడారు. మత సామరస్యంతో సమన్వయం పాటిస్తు ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా పండుగలు జరుపుకోవాలన్నారు.

శాంతి సంఘం సమావేశం

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం వివిధ మత పెద్దలతో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో మతపరంగా రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొట్టెల రమేష్, గుండా సత్యనారాయణ, గుండా వినయ్‌కుమార్, ముస్లిం మత పెద్దలు షేక్ లతీఫ్, బాబర్, మహ్మద్ రఫీ, రవి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నకిరేకల్ ఎస్‌ఐ

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తు చేసుకోండి




మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ

నకిరేకల్ : ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత-2023 అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ బాలాజీ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం శానిటరీ, ఎన్జీఓలు, మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్-2023లో భాగంగా పారిశుద్ధ్య ఘన వ్యర్థాల నిర్వహణ, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ,, సెప్టింగ్ ట్యాక్ శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణకు కృషి చేస్తున్న మహిళలు ఈ అవార్డులకు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించడం అందరి బాధ్యత

నల్లగొండ టూటౌన్ : అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణాచారి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం, ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పండిస్తున్న కూరగాయలను వాడడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రజలు రసాయనాలతో పండిచిన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం సేంద్రియ కూరగాయలను మున్సిపల్ ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు సురేష్ గుప్తా, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు సేంద్రియ కూరగాయలు అందజేస్తున్న కమిషనర్ రమణాచారి

నోట్ బుక్స్, పలకల పంపిణీ

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన మిర్యాల లింగమ్మ 3వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆమె కుమారుడు మిర్యాల రఘురాముడు, మనవడు మిర్యాల చంద్రబోస్ వట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 60 నోట్‌బుక్స్, 20 పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం .నాగయ్య, ఉపాధ్యాయులు కేశవులు పాల్గొన్నారు.

కాశీ స్వాములకు అన్న వితరణ

నకిరేకల్ : కాశీ నుంచి విజయవాడకు వెళ్తున్న 10 మంది దిగంబర స్వాములు నకిరేకల్‌లో మంగళవారం కాసేపు ఆగారు. వారికి స్థానిక లయన్స్ సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మారిడి చంద్రశేఖరశెట్టి- ప్రేమ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వంటిపాక సోమేష్, కందాల వెంకట్‌రెడ్డి, యన్న శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో..

మున్సిపాలిటీ కేంద్రంలో వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగాం కోఆర్డినేటర్ బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కిరణ్మయి, గజ్జల రామకృష్ణ, ఉప్పల వెంకటరమణ, బొల్లం శోభకృష్ణమూర్తి, రేపాల సతీష్, శివకోటి ఆంజనేయులు, కందగట్ల శ్వేత, వాడకట్టు రాధిక, గర్రె ఝాన్సీ, ఊర కల్పన, సోమ భాగ్య, సంధ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

దళారులపై చర్యలు తీసుకోవాలి

మునుగోడు : ఎలాంటి అనుమతులు లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న దళారులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం మునుగోడులో పత్తి దళారి వ్యాపారులు తూకం వేసే కాంటాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులు ఎలక్ట్రానిక్ కాంటాలు వాడకుండా పాత కాంటాలు వాడుతున్నారన్నారు. తూకం వేసే బాట్లను ఏళ్ల తరబడి పాత వాటినే వినియోగిస్తున్నారన్నారు. దీంతో రైతులు తూకంలో మోసపోతున్నారన్నారు.


27న బహిరంగ సభ

నల్లగొండ టౌన్ : జన చైతన్యయాత్ర నల్లగొండకు వస్తున్న సందర్భంగా ఈ నెల 27న భాస్కర్ టాకీస్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చేవిధంగా కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టడానికి జనచైతన్య యాత్ర నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలడుగు నాగార్జున, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, నన్నూరి వెంకటరమణారెడ్డి, తుమ్మల పద్మ, మన్నె భిక్షం పాల్గొన్నారు.

గంట నర్సిరెడ్డికి నివాళి

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం గంట నర్సిరెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి చిత్రపటానికి తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలకూర్తి కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్‌చంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, కోశాధికారి అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వనం వాణిశ్రీ, సోమయ్య, వై.సత్తయ్య, కె.వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు పి.వెంకట్‌రెడ్డి, భిక్షమయ్యలు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం



కురుమర్తి పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజకీయ నాయకులుగా, ఉపాధ్యాయులుగా, వివిధ శాఖల అధికారులుగా బాధ్యతలు నిర్వహించి అలరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి హెచ్‌ఎం బి. రమణారావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ నర్సిరెడ్డి, పి.శేఖర్, డి.అనిత, ఎస్‌ఎంసీ చైర్మన్ రవి ఉన్నారు.

పాఠశాల తనిఖీ

నల్లగొండ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు బోధించిన అంశాలు విని శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని ఆర్‌పీ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. తల్లిదండ్రుల నమ్మకం నిలబెట్టి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని అన్నారు. కలెక్టర్ వెంట ఎంఈఓ నర్సింహ, జిల్లా కామన్ బోర్డ్ సెక్రటరీ కె. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్